క్లుప్తంగా

గణేశ్ ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి



పెరవలిలో గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై అప్పారావు

పెరవలి: గణేశ్ ఉత్సవాల్లో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు చోటు లేకుండా ప్రశాంతవంతమైన వాతావరణంలో జరుపుకోవాలని పెరవలి ఎస్సై అప్పారావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉత్సవాల నిమిత్తం ఎటువంటి మండపాలు ఏర్పాటు చేసినా తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్ తదితరుల పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల నమోదు

తాళ్లపూడి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓట్ల నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ బి.రవీంద్రనాథ్, ఎంపీడీవో వెంకట రమణలు గురువారం తెలిపారు. మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, డిగ్రీ కళాశాలలో పని చేస్తున్న అధ్యాపకులు ఓటర్ కార్డు, ఆధార్ కార్డు, ఫొటోలను అందజేయాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పని చేస్తున్న వారు డీఈవో, ఆర్‌జేడీతో ధ్రువీకరణ పొంది దరఖాస్తులను ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో వచ్చే నెల 3వ తేదీలోపు అందజేయాలని తెలిపారు.

ఆడ పిల్లల అక్రమ రవాణా నివారణకు కృషి చేయాలి

పెరవలి: ఆడపిల్లల అపహరణ, అక్రమ రవాణా, బాల్య వివాహాలను నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ డి.శ్రీలక్ష్మి తెలిపారు. పెరవలి ఐసీడీఎస్ కార్యాలయంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా గత రెండు రోజులుగా బాలికల అక్రమ రవాణా, బాల్యవివాహాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించి గురువారం మానవహారం నిర్వహించారు. సూపర్‌వైజర్లు వి.సరోజినీ, సిహెచ్ లక్ష్మి, పి.నళిని, ఎం.బాల సరస్వతి అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కలుపు నివారణతో పాడ తెగులు నియంత్రణ

కొవ్వూరు: వరి పంటలో పాడ తెగులు వ్యాపించకుండా ఉండాలంటే కలుపు నివారణ తప్పనిసరిగా చేసుకోవాలని మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు సూచించారు. ధర్మవరం గ్రామంలో గురువారం పొలంబడి కార్యక్రమంలో భాగంగా క్షేత్ర స్థాయిలో వరి పంటను పరిశీలన చేశారు. మార్టేరు పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్తలు మానుకొండ శ్రీనివాస్, సీహెచ్ శ్రీనివాస్‌లు, ఏడీ పి.చంద్రశేఖర్‌లతో కూడిన బృందం వరి పంటను పరిశీలించారు. రైతులకు నుంచి సందేహాలు, సమస్యలు తెలుసుకుని నివృత్తి చేశారు. మండల వ్యవసాయ అధికారి ఎ.గంగాధర్, ఏఈవో శ్రీనివసా, ఏఏఏ జ్ఞానదాస్, రైతులు పాల్గొన్నారు.

నేడు సామూహిక కుంకుమ పూజలు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో ఉన్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని శుక్రవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ గురువారం తెలిపారు. పూజల్లో పాల్గొనే మహిళలకు దేవస్థానం వారు కుంకుమ, గాజులు, ప్రసాదాలు ఉచితంగా అందిస్తామని ఆయన చెప్పారు.

వైద్యులపై దాడులు హేయమైన చర్య



ఇటీవల కాలంలో వైద్యులపై దాడులు అధికంగా జరుగుతున్నాయి. ఇది చాలా హేయమైన చర్య. ఎన్నో కష్టాలకు ఓర్చి వైద్య వృత్తిలోకి వచ్చాం. ఆసుపత్రిలో నిత్యం మాకు పరీక్షే. డాక్టర్లకు భద్రత కల్పించడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. ఒక కోల్‌కతా ఘటనే కాదు నిత్యం ఎన్నో సంఘటనలు జరుగుతున్నాయి. ఇవి పునరావృతం కాకుండా చూడాలి. ప్రభుత్వాలు కఠిన చట్టాలు అమలుచేయాలి.

– డాక్టర్ సలాది సాయికుమార్, ఎండీ, సూర్యచంద్ర హోమియో



ప్రత్యేక చట్టం అవసరం



మహిళా వైద్యులు, సిబ్బంది రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి. కోల్‌కతా ఘటనను దృష్టిలో ఉంచుకుని అలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. చట్టాల్లో మార్పులతోనే నేరాలు అదుపులోకి వస్తాయి. రోగుల ప్రాణాలు కాపాడేవారికి అండగా ఉన్నామని ప్రభుత్వం భరోసా కల్పించాలి. నిందితులను కఠినంగా శిక్షిస్తేనే ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయి.

– డాక్టర్ చందన పర్వతవర్ధిని, గైనకాలజిస్ట్, రాజమహేంద్రవరం

పొలంలో పాఠాలు

- గ్రామాల్లో పొలంబడి కార్యక్రమాలు
- క్షేత్ర స్థాయిలో శాస్త్రీయ, సాంకేతిక సాగు పాఠాలు
- మేలైన వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన
- కార్యక్రమాలు నిర్వహిస్తున్న అధికారులు



పొలంబడి కార్యక్రమంలో వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ జేడీ మాధవరావు.(ఫైల్)

నల్లజర్ల: శాస్త్రీయ సాగుపై రైతులకు పొలాల్లో, తోటల్లో పాఠాలు నేర్పిస్తున్నారు. అధికారులే ఉపాధ్యాయులుగా మారి గ్రామాలకు వెళ్లి వ్యవసాయంలో ప్రకృతి వ్యవసాయం, యాజమన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించే ఉద్దేశంతో ప్రభుత్వం పొలంబడి కార్యక్రమాలను అమలు చేస్తోంది. రసాయనిక ఎరువులు తగ్గించి, సాంప్రదాయ ప్రకృతి సాగును పెంచేలా అధికారులకు శిక్షణ ఇస్తోంది. శిక్షణ పొందిన అధికారులు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇది దాదాపు అన్ని గ్రామాల్లోనూ జరుగుతున్న ప్రక్రియ. అధికారులు 14 వారాల పాటు శాస్త్రీయ, సాంకేతిక సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. పంట విత్తడానికి ముందు నుంచి కోత వరకూ 14వారాల పాటు రైతులకు పొలంబడి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 10 హెక్టార్ల పరిధిలో 30 నుంచి 40 మంది రైతులతో పాటు గ్రామ వ్యవసాయ సహాయకులకు ప్రయోగాత్మకంగా అవగాహన కల్పిస్తున్నారు. రైతులు పొలంబడిలో నేర్చుకున్న విషయాలను గ్రామస్తులకు రచ్చబండ వద్ద ఇతరులకు వివరిస్తారు. ఫలితంగా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని రుజువు చేస్తున్నారు.

కొవ్వూరు వ్యవసాయశాఖ సబ్‌డివిజన్‌లో..

కొవ్వూరు వ్యవసాయశాఖ సబ్‌డివిజన్‌లో నల్లజర్లలో ఈ పొలంబడి కొనసాగుతోంది. ఈ కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ జేడీ ఎస్.మాధవరావు ప్రారంభించారు. కొవ్వూరు ఏడీఏ టి.చందరశేఖర్, డీఆర్‌సీ ఏడీఏ జ్యోతిర్మయి, ఏఓ వెంకన్నబాబు, మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ హాజరయ్యారు. అధికారులు, రైతులు, వ్యవసాయ సహాయకులు ఎంపిక చేసిన పొలాన్ని ప్రతి వారం పర్యవేక్షిస్తారు. పంటపై మిత్ర పురుగులు, శత్రు పురుగులను గుర్తిస్తారు. మిత్ర పురుగులు చేసే మేలును జిల్లా వనరుల కేంద్రం నుంచి వచ్చిన ఏడీఏ వీరికి వివరిస్తారు. వరిలో వచ్చే చీడపీడలు వాటి నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు తెలుసుకుంటారు. ఈ శిక్షణ ద్వారా వ్యవసాయ సహాయకులు గ్రామాలలో రైతులకు అవగాహన కల్పిస్తారు. ఈ విధానం వల్ల గత రబీ సీజన్‌లో రైతులు ఎకరానికి 45 నుంచి 50 బస్తాల వరకు దిగుబడి సాధించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో కూడా పొలంబడి కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి కమల్‌రాజ్ ఆధ్వర్యంలో పటిష్టంగా అమలు చేస్తున్నారు.

శిక్షణతో ఎంతో ప్రయోజనం



రైతులు అధిక దిగుబడి చేకూర్చాలనే ఉద్దేశంతో అధికారులు పొలంబడి కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రతివారం మేం నేర్చుకున్న విషయాలను రైతులకు వివరిస్తున్నాం. ఉన్నతాధికారుల శిక్షణలో మేమంతా నేర్చుకున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు వివరిస్తున్నాం. వ్యవసాయంలో నూతన పద్ధతులు తెలుసుకుంటున్నాం.

– పామర్తి దుర్గా సురేష్, వ్యవసాయ సహాయకులు, అనుమునిలంక

యాంత్రీకరణ సాగుకు దోహదం



మా పరిధిలో రైతులకు యాంత్రీకరణ సాగుపై కూడ శిక్షణ ఇస్తున్నాం. సాంకేతికతను ఉపయోగించి పంటలు సాగు చేయిస్తున్నాం. పెట్టుబడులు తగ్గించి దిగుబడులు పెంచేలా రైతులను ప్రోత్సహిస్తున్నాం. రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. వారు కూడా అమలు చేస్తున్నారు.

– లంక దుర్గా భవాని, వ్యవసాయ సహాయకులు, అనంతపల్లి-2

శ్రద్ధ చూపుతున్న రైతులు



ప్రతి బుధవారం అనంతపల్లిలో నిర్వహిస్తున్న పొలంబడి కార్యక్రమానికి రైతులు శ్రద్ధగా వస్తున్నారు. గత రబీ సీజన్‌లో ఇచ్చిన శిక్షణ రైతులకు ఎంతగానో ఉపయోగపడింది. ఈ ఏడాది వారంతా అదే విధానాలు కొనసాగిస్తున్నారు. తద్వారా పంటలను సంరక్షించుకుంటున్నారు. రబీలో 50 బస్తాల వరకు దిగుబడులు వచ్చాయి. రైతులు మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయంలో నూతన విధానాలు అవలంబిస్తున్నారు.

– డి.జాన్ పాల్, వ్యవసాయ సహాయకులు, అనంతపల్లి -1

మూడోసారి వైనాట్‌కు టైమ్స్ బిజినెస్ అవార్డు



నటి రకుల్‌ప్రీత్ సింగ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వెంకట్రాయుడు దంపతులు

తణుకు: పట్టణానికి చెందిన వైనాట్ షాపింగ్ మాల్ అధినేత జుజ్జవరపు వెంకటరాయుడు ప్రముఖ నటి రకుల్‌ప్రీత్‌సింగ్ చేతుల మీదుగా టైమ్స్ బిజినెస్ అవార్డును బుధవారం అందుకున్నారు. ఎలక్ట్రానిక్స్, హోం అప్లయన్సెస్ విభాగంలో ఉత్పత్తులు, ఉత్తమ సర్వీసులు అందించినందుకు గాను విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వెంకట్రాయుడు, శ్రీదేవి దంపతులు ఈ అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి టీజీ భరత్ పాల్గొన్నారు. ఇప్పటివరకు మూడోసారి ఈ అవార్డును అందుకోవడం విశేషం. ఈ విజయంలో వినియోగదారులకు భాగస్వామ్యం ఉందని పేర్కొన్నారు.

కొవ్వూరు మున్సిపల్ కమిషనర్‌గా నాగేంద్రకుమార్



కొవ్వూరు: స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా నాగేంద్రకుమార్ నియమితులయ్యారు. ఇక్కడ పని చేసిన కె.డానియేలు జోసఫ్ కనిగిరికి బదిలీ అయ్యారు. గ్రేటర్ విశాఖ మునిసిపల్ కార్పొరేషన్‌లో సూపరింటెండింట్‌గా పనిచేస్తున్న ఈయన పలాసలో మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్నారు. బదిలీపై ఇప్పుడు కొవ్వూరు వస్తున్నారు.

వేంకటేశ్వరుని హుండీ ఆదాయం రూ.3.17 లక్షలు



అన్నవరప్పాడులో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు, కమిటీ సభ్యులు

పెరవలి: అన్నవరప్పాడులోని వేంకటేశ్వరస్వామి హుండీని గురువారం అధికారులు, గ్రామ పెద్దల సహకారంతో తెరిచి లెక్కించినట్టు ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు. ప్రధాన హుండీతో పాటు ఉప ఆలయాల్లోని హుండీలా ద్వారా రూ.3,10,030 వచ్చిందని, అన్నదాన హుండీ ద్వారా రూ.7,601 మొత్తం ఆదాయం రూ.3,17,631 వచ్చిందని తెలిపారు. ఈ ఆదాయం 36 రోజులకు సంబంధించిదని, ఈ ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి వినియోగిస్తామని అధికారులు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో తీపర్రు గ్రూప్ దేవాలయాల కార్యనిర్వహణాధికారి ఎంవీ రామయ్య సమక్షంలో గ్రామ పెద్దలు పంతం చిన్న, పంతం నాగేశ్వరరావు, యాళ్లబండి శ్రీనివాస్, కోటిపల్లి గంగన్న, ఓసూరి బాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హిందూ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

నల్లజర్ల: గ్రామాల్లో భావితరాలకు హిందూ జ్ఞానాన్ని పెంపొందించే విధంగా కార్యక్రమాలు రూపకల్పన చేయాలని పేరవరం గీతాశ్రమ పీఠాధిపతి శ్రీ సత్యానందగిరి స్వామీ ప్రబోధించారు. విశ్వహిందూ పరిషత్ ఏర్పడి 60ఏళ్ల పూర్తయిన సందర్భంగా నల్లజర్లలో గురువారం సోమాలమ్మ గుడి వద్ద షష్ట్యబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన సత్యానందగిరి స్వామీజీ మాట్లాడుతూ ఊరూర హరినామ సంకీర్తన, రామాయణం, భాగవతం, భగవద్గీత కార్యక్రమాలు విస్తృతం చేయాలని సూచించారు. కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి ముత్యాల గంగాధర్ అధ్యక్షత వహించారు. గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని, ఊరూర గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి విశ్వహిందూ పరిషత్‌ను బలోపేతం చేయాలని సమావేశం తీర్మానించింది. కార్యక్రమంలో అనంతపల్లి స్వర్ణదుర్గాశ్రమ నిర్వాహకులు కొండమూరి రాజగోపాలరావు, వీహెచ్‌పీ మండలశాఖ అధ్యక్షుడు కందుల రవిశేఖర్, ఆలపాటి ధనలక్ష్మి, వెల్లంకి రాఘవ, మాయలేడి తాతారావు, రామకృష్ణ, పద్మజ, గణేశ్వరి పాల్గొన్నారు.

ఉండ్రాజవరం ఎస్సైగా గుబ్బల శ్రీనివాసు



శ్రీనివాసుకు పుష్పగుచ్ఛం అందించి, స్వాగతం పలుకుతున్న సిబ్బంది

ఉండ్రాజవరం: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్సైగా గుబ్బల శ్రీనివాసు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఏలూరు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేసిన ఎస్సై వి.అప్పలరాజు రాజమండ్రి త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది శ్రీనివాస్‌కు స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పెద్దేవంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తాళ్లపూడి: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అన్నపూర్ణ సూచించారు. పెద్దేవంలో సచివాలయం వద్ద గురువారం మలకపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో వైద్యులు పరీక్షలు చేసి మందులు అందజేశారు. వైద్యురాలు అన్నపూర్ణ మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు వృద్ధి చెంది జ్వరాలకు కారణమవుతాయన్నారు. వాటి నుంచి మనల్ని కాపాడుకోవాలంటే మన పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో ఎస్.రమేష్, ఇతర వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గోపాలపురం. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాచి చల్లార్చిన నీటిని తాగాలని అన్నదేవరపేట సీహెచ్‌సీ వైద్యురాలు ఎం.నవ్యశ్రీ అన్నారు. గోపాలపురం మండలం చిట్యాలలోగురువారం వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 50 మందికి రక్త పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఎంపీహెచ్‌ఏ డి.ప్రసన్నకుమార్, హర్షిని, గంగా భవాని, ఆశవర్కర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: వెలగదుర్రులో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఉండ్రాజవరం పీహెచ్‌సీ వైద్యురాలు ఆర్.ఉషాదేవి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.సుబ్రమణ్యం, మహిళా ఆరోగ్య కార్యకర్త కుమారి, కనకదుర్గ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొవ్వూరు: దొమ్మేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పెనకనమెట్టలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి ఎస్.ధర్మరాజు, డాక్టర్ దివ్య రోగులకు వైద్య సేవలు అందించారు. గ్రామంలో ఐదుగురు జ్వర పీడితులను గుర్తించి, రక్త నమూనాలు సేకరించినట్టు తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బీవీ లక్ష్మి, ఎంపీహెచ్ఎస్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలంతా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యురాలు శ్రీనిధి సూచించారు. మండలంలోని సమిశ్రగూడెం, కోరుమామిడి గ్రామాల్లో వైద్యశిబిరాలు గురువారం నిర్వహించారు. 212 మందికి శిబిరాల్లో వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

నిడదవోలు : పట్టణంలోని నెహ్రూనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో గురువారం ఇంటింటా ఫీవర్ సర్వే చేపట్టారు. అనంతరం వార్డు సచివాలయంలో నిర్వహించిన వైద్య శిబిరంలో నెహ్రూనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి ఈ తేజశ్రీ 52 మందికి వైద్య పరీక్షలు చేశారు.

నల్లజర్ల: పోతవరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సుభద్రపాలెంలో వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టరు రాజశేఖర్ ఆధ్వర్యంలో గ్రామంలో ఫీవర్ సర్వే నిర్వహించారు. తర్వాత వైద్య శిబిరంలో దాదాపు వంద మందికి పరీక్షలు చేశారు.

గుండెపోటుతో అంగన్‌వాడీ టీచర్ మృతి

దేవరపల్లి: స్థానిక అంగన్‌వాడీ టీచర్, వైఎస్సార్ సీపీ నాయకుడు, యర్నగూడెం గ్రామ సర్పంచ్ బొంతా భరత్‌బాబు తల్లి బొంతా రూన్సీ(59) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. బుధవారం ఇంటి వద్ద అస్వస్థతకు గురైన ఆమెను కుటుంబ సభ్యులు చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఆమె తుదిశ్వాస విడిచినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. రూన్సీ మృతిపై వైఎస్సార్ సీపీ నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు సంతాపం తెలిపారు.

యాదవోలులో వైద్యశిబిరం

దేవరపల్లి: యాదవోలు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో గ్రామంలోని దళితవాడలో గురువారం వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ హరిచందన వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గురవారం సాక్షిలో ఇంటింటా జ్వరపీడుతులు అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. ఎస్సీ కమ్యూనిటీ భవనంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి, జ్వరపీడితులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 84 మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా, 12 మంది జ్వరంతో బాధపడుతున్నట్టు గుర్తించినట్టు వైద్యాధికారి హరిచందన తెలిపారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని అన్ని గ్రామాల్లో ఏఎస్ఎంలు, ఎంసీహెచ్‌లు, ఆశాలతో ఇంటింటి ఫీవర్స్ సర్వే చేస్తున్నారన్నారు. ఈ శిబిరంలో పీహెచ్‌సీ సూపర్వేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



దళితవాడలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ హరిచందన

నేత్రదానం బాధ్యతగా తీసుకోవాలి

చాగల్లు: అంధత్వ నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని చాగల్లు వైద్యాధికారి డాక్టర్ తనూజ అన్నారు. గురువారం గ్రామంలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ మనోజ్, పీహెచ్ఎన్ జమీల ఆరోగ్య పర్యవేక్షకులు ఎస్ఎల్‌కే ప్రభావతి, ఎంఎల్‌హెచ్‌పీలు, హెల్త్ అసిస్టెంట్లు సత్యనారాయణ, నెహ్రూ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహాల ముస్తాబు



కుమారదేవం గ్రామంలో ముస్తాబైన వైఎస్సార్ విగ్రహం

కొవ్వూరు: సెప్టెంబర్ రెండో తేదీన నిర్వహించే మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని నిర్వహించేందుకు కార్యకర్తలు సన్నద్ధమవుతున్నారు. గ్రామాల్లో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు రంగు వేయించి ముస్తాబు చేస్తున్నారు. కుమారదేవం పంచాయతీ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని శుభ్రం చేయించి రంగు వేసి వేశారు. ధర్మవరంలోను గ్రామ కమిటీ అధ్యక్షుడు జలాది రవికుమార్, తలారి పండు, అశోక్ తదితరులు వైఎస్సార్ విగ్రహాన్ని శుభ్రం చేయించి రంగులు వేయించారు.

శెట్టిపేట ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా మాణిక్యాలరావు

నిడదవోలు రూరల్: మండలంలోని శెట్టిపేట జైహింద్ ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఎస్‌బీ గణేష్‌రావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా ఖండవల్లి మాణిక్యాలరావు, ఉపాధ్యక్షుడిగా వీరవెంకట్రావు, కార్యదర్శిగా పెదనాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు రేఖ భాస్కరరావు, కమిటీ సభ్యులు అభినందించారు.

క్రీడలతో మానసికోల్లాసం

కొవ్వూరు: స్పోర్ట్స్‌తో మానసిక ఉల్లాసంతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లోను స్పోర్ట్స్ కోటా కింద ఉపాధి పొందవచ్చునని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ పి.సుజాత పేర్కొన్నారు. గురువారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన స్పోర్ట్స్ దినోత్సవంలో ఆమె మాట్లాడారు. కళాశాలలో విద్యార్థులతో స్పోర్ట్స్ కమిటీ ఏర్పాటు చేశారు. వైస్ ప్రిన్సిపాల్ వి.ఆనందజ్యోతి, పీడీ ఎస్.తేజశ్రీ, పీఈటీ జి.లక్ష్మీదుర్గ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

ఉండ్రాజవరం: విద్యతో పాటు ప్రతి విద్యార్థి క్రీడల్లోనూ రాణించాలని స్థానిక ఉన్నత పాఠశాల హెచ్ఎం కేఎస్‌కే మాణిక్యాలరావు అన్నారు. పాఠశాలలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఎంఎస్‌పీ వల్లీ మాట్లాడుతూ విద్యార్థులకు శ్రీధ్యాన్‌చంద్ క్రీడా జీవితం గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



చాగల్లు ఎంపీయూపీ స్కూల్‌లో తెలుగు భాషాదినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం: మాతృభాషను గౌరవించడం అంటే తల్లిని గౌరవించినట్టేనని విశ్రాంత ఆంగ్ల భాషా అధ్యాపకులు కోట రామప్రసాద్ అన్నారు. ఉండ్రాజవరం శాఖా గ్రంథాలయంలో గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి గ్రంథాలయ పాలకుడు గుత్తికొండ కృష్ణారావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు ఆకెళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు వెలుగు కోసం గిడుగు చేసిన ఉద్యమ ఘట్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వంగా చంద్రారావు, సింహాద్రి శ్రీరామ చంద్రమూర్తి, ఎంవీ కృష్ణారావు, ఎం.శ్రీనివాసు, పి.లోవరాజు పాల్గొన్నారు. ఉండ్రాజవరం ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వకృత్వ, వ్యాస రచన తదితర పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

నిడదవోలు: స్థానిక వెలగపూడి దుర్గాంబ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ అధ్యక్షురాలు పి.ఉషారాణి ఆధ్వర్యంలో గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, కవిత, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. వేడుకల్లో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.కంబయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. తహసీల్దార్ సల్దార్ రవీంద్రనాథ్, ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. రాగోలపల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం డి.దుర్గారావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

చాగల్లు: చంద్రవరం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం, క్రీడా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.శ్రీనివాస్, ఎస్.రాధాక్రిష్ణ, ఎస్.హేమారావు, చల్లారావు పాల్గొన్నారు.

కొవ్వూరు: మాతృభాష తెలుగును ప్రతి ఒక్కరూ పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్వీ సుబ్బారావు పేర్కొన్నారు. కళాశాలలో తెలుగు భాష దినోత్సవాలన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష ఔన్నత్యం గురించి విద్యార్థులకు వివరించారు. వైస్ ప్రిన్సిపల్ వై.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: చిట్యాల జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం శ్రీపాద లక్ష్మీనరసింహశాస్త్రి ఆధ్వర్యంలో తెలుగు భాషా, క్రీడా దినోత్సవాలను నిర్వహించారు. గిడుగు రామూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులు కూన రమేష్, పద్మ, రాఘవకుమారి, సీఆర్పీ నాగరాజు పాల్గొన్నారు.



తాళ్లపూడి తహసీల్దార్ కార్యాలయంలో తెలుగు భాషా దినోత్సవం



ఉండ్రాజవరంలో రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సభ్యులు